# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రంలో కరవు ఉండదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
- ❖ వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ సూచించారు.

====================

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పూర్తయి, వంశధార నుంచి పెన్నానది వరకు నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రంలో కరవు ఉండదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం పరమ సముద్రం వద్ద కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చారు. అనంతరం బహిరంగసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హంద్రీ నీవా ప్రాజెక్టుతో 33 లక్షల మందికి తాగునీరు.. 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. వచ్చే ఏడాది నాటికి హంద్రీనీవా ద్వారా చిత్తూరుకు కూడా నీళ్ళు ఇస్తామన్నారు.  కుప్పంలో నూతన పరిశ్రమలు ఏర్పాటైతే ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ 8 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాయలసీమను రాళ్ళ సీమ కానివ్వమని, రతనాల సీమగా చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదేని, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని అన్నారు.

(వాయిస్ 35 సెకన్లు)

====================

ఏడాది కాలంలో పర్యాటక రంగంలో దాదాపు 12 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విశాఖపట్నంలో 13.5 కోట్ల రూపాయలతో ఆధునికీకరించిన యాత్రినివాస్ ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఆర్కే బీచ్ లో టూరిజం సీఆర్ వో కౌంటర్ ను ప్రారంభించారు. వచ్చే నెల 5 నుండి 7వ తేదీ వరకు జరగనున్న వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ - 2025 బ్రోచర్ ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక శాఖ పరిధిలోని హోటళ్లు, రిసార్ట్స్ లో వసతి సౌకర్యాలు ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం హబ్, టూరిజం సర్క్యూట్ లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

విరామం

====================

మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను పాఠ్య ప్రణాళికలో చేర్చాలని, ప్రతివారం విద్యార్థినులకు తరగతులు నిర్వహించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ రోజు మహిళల సంక్షేమం, భద్రత, హక్కులపై జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయపాటి శైలజ మాట్లాడుతూ.... వేధింపులు ఎదుర్కొంటున్న విద్యార్థినులు, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అన్నారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్ తో పాటు, 112, 181 కాల్ సెంటర్లు ఉన్నాయని తెలియజేశారు. "వన్ స్టాప్ సెంటర్స్" ద్వారా మహిళలకు వసతి కల్పించడంతో పాటు కౌన్సిలింగ్ నిర్వహిస్తారని తెలిపారు.

====================

నౌకాదళ దినోత్సవాలలో భాగంగా 'వైజాగ్ నేవీ మారథాన్' (వీఎన్ఎం-25)ను ఘనంగా నిర్వహించనున్నట్లు తూర్పు నౌకాదళం ప్రకటించింది. డిసెంబర్ 14న సాగర తీరంలో ఈ మారథాన్ ను నిర్వహించనున్నామని ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్, మారథాన్ డైరెక్టర్ కమాండర్ అనిరుధ రాయ్ తెలిపారు. విశాఖపట్నంలో ఈ రోజు పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సెప్టెంబర్ 1 నుంచి www.vizagnavymarathon.run ద్వారా రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని అన్నారు. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10, 5 కిలోమీటర్ల విభాగాలలో పోటీలు వుంటాయని తెలిపారు.

(వాయిస్ 22 సెకన్లు)

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ... ఈ క్రీడా ఉత్సవంలో పాల్గొనేందుకు ఫిట్‌నెస్ ఔత్సాహికులు, ప్రొఫెషనల్ రన్నర్లు, పౌరులందరినీ ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

====================

రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తామని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పంలో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలలో భాగంగానే కుప్పంకు కృష్ణా జలాలను తీసుకు వచ్చి రాయలసీమ రూపురేఖలు మారుస్తున్నామన్నారు. ఆసియాలోనే అతిపెద్ద ప్రాజెక్టు హంద్రీ-నీవా ప్రాజెక్టు అని.. 738 కిలోమీటర్ల మేర హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తి చేయడం గొప్ప విషయమన్నారు.

====================

రాష్ట్రంలో విద్యుత్ కొరతను నివారించి, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో 4 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న కంటైనర్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నెల్లూరులో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ సబ్ స్టేషన్ రిమోట్ ద్వారా పని చేస్తుందన్నారు. మామూలుగా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ఐదు నుంచి పది ఎకరాల వరకూ స్థలం అవసరం ఉంటుందని, అయితే ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అతి తక్కువ స్థలంలో ఈ కంటైనర్ సబ్ స్టేషన్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

====================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకుగాను నూతన వసతి సముదాయాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకు రానున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు తెలిపారు.

====================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు, కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకటరావు పేర్కొన్నారు.

====================
====================